క్లుప్తంగా

జంబో బ్యాలెట్ బాక్సుల పరిశీలన



బ్యాలెట్ బాక్సులను పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోని రూరల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జంబో బ్యాలెట్ బాక్సులను సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. బ్యాలెట్ బాక్సులను ఉపయోగించాల్సిన విధానంపై అధికారులకు సూచనలిచ్చారు. ఎన్నికలు పగడ్బందీగా నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. అధికారులు ఎన్నికల సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. డిప్యూటీ కలెక్టర్ రమణకాంత్‌రెడ్డి, పరిపాలనాధికారి గోవింద్‌సింగ్, తహసీల్దార్ వెంకటలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సావిత్రిభాయి పూలే వర్ధంతి



మాట్లాడుతున్న దస్తగిరినాయుడు

ఆదోని రూరల్ : ఆదోని డివిజన్ బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం సావిత్రిబాయి పూలే 126వ వర్ధంతిని మండిగిరిలోని బీసీ హాస్టల్‌లో నిర్వహించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరినాయుడు అధ్యక్షతన సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. హాస్టల్ వార్డెన్ మాదన్న, బీసీ నాయకులు, దస్తగిరినాయుడు మాట్లాడుతూ సావిత్రిబాయిపూలే సేవలను కొనియాడారు. నాయకులు రాముడు, రామకృష్ణ, నాగార్జున, శేషన్న, డాక్టర్ వీరేష్, షేక్షావలి, సాయిబాబా పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ అందరి బాధ్యత



అల్బెండజోల్ మాత్రలను హెచ్ఎంలకు అందజేస్తున్న కమిషనర్, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు

ఆదోనిటౌన్ : నులిపురుగుల నివారణ అందరి బాధ్యత అని కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం హవన్నపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2 – 12 సంవత్సరాలు నిండిన విద్యార్థులకు తప్పనిసరిగా అల్బెండజోల్ 400 ఎంజీ ట్యాబెట్లను వేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తలకు సూచించారు. అనంతరం హెచ్ఎంలకు మాత్రలు అందజేశారు.

కబడ్డీలో ప్రతిభ చూపిన విద్యార్థినికి అభినందన



తల్లిదండ్రులు, విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కోసిగి: మండలంలోని పల్లెపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని బెళగల్ రాజేశ్వరి అండర్–14 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపిందని హెచ్ఎం సుధాకర్ తెలిపారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో తల్లిదండ్రులు శాంతమ్మ, హనుమంతుతో పాటు విద్యార్థిని, ఉపాధ్యాయుడు గంగాధర్‌ను అభినందించారు. హెచ్ఎం మాట్లాడుతూ ఇటీవల చిత్తూరు జిల్లాలో జరిగిన అండర్–14 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు తరపున రాజేశ్వరి జట్టు కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిందని, క్వార్టర్ ఫైనల్‌లో గుంటూరు, సెమీ ఫైనల్‌లో విజయనగరం, ఫైనల్ మ్యాచ్‌లో ప్రకాశం జిల్లా జట్టులపై తమ జట్టు గెలుపొందడంలో కీలకంగా వ్యవహరించిందని చెప్పారు. త్వరలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. మారుమూల పల్లెపాడు గ్రామం నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

మంత్రాలయం రూరల్: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మాధవరం ఎస్ఐ కిరణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పి.తండాలో ఓంకార్‌నాయక్ 20 (90ఎంఎల్) కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అక్రమ మద్యం రవాణా, పేకాట, మట్కా వంటివి నిర్వహిస్తే తమకు సమాచారమివ్వాలని కోరారు. వివరాలను సెల్ 9121101153 నంబర్‌లో తెలియజేయాలని సూచించారు.

బీమా..ధీమా

రైతుకు వడ్డీలేని రుణాలు.. 9 గంటల ఉచిత విద్యుత్.. వైఎస్సార్ రైతు భరోసా.. వైఎస్సార్ జలసిరి.. వైఎస్సార్ యంత్ర సేవ.. ఇలా అన్నదాతలను ఆదుకోవడానికి వివిధ రకాల పథకాలు.. వారి సంక్షేమానికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోంది. గత ప్రభుత్వాలేవీ చేయలేనంతగా సాగుకు తోడై నిలిచింది. విత్తు మొదలు గిట్టుబాటు ధర వరకు అండగా నిలుస్తోంది. ఇందులో వైఎస్సార్ ఉచిత పంటల బీమా కర్షకులకు వరంగా మారింది. వారిపై పైసా ప్రీమియం భారం మోపకుండానే బీమా వర్తింపజేస్తోంది. ప్రకృతి విపత్తులకు దెబ్బతిన్న పంటలకు పరిహారం అందజేసి వారికి భరోసా నిస్తోంది.

- రైతులకు భరోసాగా 'వైఎస్సార్ ఉచిత పంట బీమా'
- రబీలో 7,037 మంది రైతుల నమోదు
- పథకం నిర్వహణపై హర్షం



కోసిగి వద్ద సాగైన వేరుశనగ పైరు

మంత్రాలయం : నియోజకవర్గంలో దాదాపు 1.94 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. అందులో రబీ సీజన్‌లో 14,686 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. బోర్లు, బావులు, గురురాఘవేంద్ర ప్రాజెక్టు, పులికనుమ, తుంగభద్ర దిగువ కాలువ, ఎపీఐడీసీ ఎత్తిపోతల పథకాల కింద ఈ పంటలు వేశారు. కోసిగి మండల పరిధిలో వేరుశనగ, ఉల్లి, కూరగాయలు, మిరప, మంత్రాలయం పరిధిలో వరి, మిరప, కౌతాళంలో వరి, మిరప, వేరుశనగ, పెద్దకడబూరు మండలంలో వేరుశనగ, ఉల్లి, మిరప, కూరగాయలు తోటలు ఉన్నాయి. ఈ–కేవైసీ ద్వారా పంట నమోదు చేసుకున్న ప్రతి రైతుకు బీమా వర్తింపజేస్తారు. రెండ్రోజుల క్రితంతో పంట బీమా నమోదు ప్రక్రియ పూర్తయ్యింది.

7,037 మంది రైతులకు బీమా నమోదు..

మంత్రాలయం నియోజకవర్గంలో రబీ సీజన్‌లో 7,037 మంది రైతులు ఈ–కేవైసీతో పంట బీమా చేసుకున్నారు. అత్యధికంగా పెద్దకడబూరులో 2,648 మంది రైతులు, అత్యల్పంగా మంత్రాలయంలో 978 మంది రైతులు పంట బీమా నమోదు చేయించుకున్నారు. ఆయా సచివాలయ పరిధిలో అగ్రికల్చర్ అసిస్టెంట్లతో బీమా నమోదు చేయించారు.

ఆసరాగా పథకాలు..

ఉచిత పంటల బీమా రైతులకు ఎంతో ఆసరాగా నిలుస్తోంది. పైసా ప్రీమియం చెల్లించకుండా పంట నష్టానికి పరిహారం అందజేస్తుండటంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రైతు భరోసా ద్వారా ఏటా రూ.13,500 పెట్టుబడి నిధి రావడం, పంట నష్ట పరిహారం సకాలంలో మంజూరు చేస్తుండటంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. సన్న, చిన్నకారు రైతులకు ఈ పథకాలన్నీ వరంగా మారాయని పేర్కొంటున్నారు.

మండలాల వారీగా పంటల బీమా నమోదు వివరాలు

మండలం	రబీ సాగు (ఎకరాల్లో)	రైతులు
కోసిగి	3,955	1,728
కౌతాళం	4,396	1,683
మంత్రాలయం	1,683	978
పెద్దకడబూరు	4,652	2,648
మొత్తం	14,686	7,037

మంచి పథకం



వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం చాలా మంచి పథకం. బీమా చెల్లించకపోయినా లక్షలాది మంది రైతులకు పంట నష్టపరిహారం అందజేయడం అభినందనీయం. రబీ సీజన్‌లోనూ 4 ఎకరాలకు పంట బీమా చేయించుకున్నాను. చాలా మంది రైతులు బీమా చేయించుకుంటున్నారు. పంటలు నష్టపోతే మమ్మల్ని ఆదుకోవడానికి చర్యలు చేపట్టడం అభినందనీయం.

– నవీన్‌రెడ్డి, పెద్దకడబూరు

రైతులకు ఎంతో ఉపయోగకం



ప్రభుత్వం కల్పించిన ఈ సదావకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలి. పంట నమోదు ప్రక్రియకు సహకరిస్తే బీమా వర్తింపజేస్తున్నారు. నేను ఏటా పంట నమోదు చేయించుకుంటున్నాను. పథకం వర్తింపజేయడంతో ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోతే పరిహారం అందజేసి నష్టాలపాలు కాకుండా ఆదుకుంటోంది. రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది.

– పీర్‌సాహెబ్, బదినేహాల్

కర్ణాటక మద్యం పట్టివేత



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సెబ్ సీఐ జయరాంనాయుడు

మంత్రాలయం రూరల్: మండలంలోని మాధవరం సమీపంలోనున్న సరిహద్దు చెక్‌పోస్టు వద్ద కర్ణాటక రాష్ట్రం నుంచి ఏపీలోకి ద్విచక్ర వాహనంపై మద్యం తీసుకొస్తున్న వ్యక్తిని సెబ్ పోలీసులు శుక్రవారం గుర్తించారు. సీఐ జయరాంనాయుడు తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక రాష్ట్రం బెల్గాం జిల్లా అథనికి చెందిన హనుమంత్‌దరీపా థకన్వార్, పరశప్ప కడపాటి బైక్‌పై 28 (90ఎంఎల్) మద్యం బాటిళ్లను ప్లాస్టిక్ సంచుల్లో వేసుకుని వస్తుండగా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి బైక్‌ను సీజ్ చేశామన్నారు. ఎస్ఐలు సోమశేఖర్‌రావు, చంద్రమోహన్, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఆదోని రూరల్ : అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకొని, ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సెబ్ సీఐ హరికృష్ణ శుక్రవారం తెలిపారు. మదిరె క్రాస్ వద్ద తనిఖీలు చేపట్టగా ఆదోనికి చెందిన రామన్న, కర్ణాటకలోని ఆల్బానూర్‌కు చెందిన లోకన్న అనే ఇద్దరు మోటార్ సైకిళ్లపై చెరొక సంచిలో కర్ణాటకకు చెందిన 144 ఓసీ డీలక్స్ విస్కీ ప్యాకెట్లను తరలిస్తూ పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. సెబ్ ఎస్ఐ శివప్రసాద్, కానిస్టేబుళ్లు సుధాకర్, శ్రీనివాస్, రోహిన్ ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకుందాం



మాట్లాడుతున్న వై.ప్రదీప్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ అభ్యర్థి మధుసూదన్

మంత్రాలయం రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు వై.ప్రదీప్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రాంపురం గ్రామంలో నియోజకవర్గంలోని జెడ్పీటీసీ,ఎంపీటీసీ సభ్యులు, ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ మధుసూదన్‌తో పరిశీలకుడు భరత్‌కుమార్ కలిసి సమావేశం నిర్వహించారు. ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల అభ్యర్థి మధుసూదన్, పట్టభద్రుల అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండలాల నాయకులు జి.భీమిరెడ్డి, మురళీరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, ముఖ్య నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదోని రూరల్ : గ్రాడ్యుయేట్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ బరిలో ఉన్న రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ మాజీ మున్సిపల్ చైర్మన్ దేవదాస్, కౌన్సిలర్ ఎ.వి.సురేష్ ఇంటింటికీ తిరిగి ఓటర్లను అభ్యర్థించారు. శుక్రవారం పట్టణంలోని రెండో వార్డులో కౌన్సిలర్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు.

కన్నడిగుల పాదయాత్ర ప్రారంభం



భజనతో పాదయాత్రగా వెళ్లుతున్న సింధనూరు వాసులు, భక్తులకు భోజనాలు వడ్డిస్తున్న దాతలు

- శ్రీశైలానికి తరలివెళ్తున్న భక్తులు

కోసిగి: ఉగాది సందర్భంగా శ్రీశైలంలో వెలసిన శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి దర్శనార్థం కర్ణాటక భక్తుల పాదయాత్ర ప్రారంభమైంది. మండల కేంద్రం మీదుగా సాగే యాత్రలో శుక్రవారం కర్ణాటక రాష్ట్రంలోని మస్కీ, సింధనూరు ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు పాదయాత్రగా తరలి వెళ్లారు. ఏటా ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి వారి దర్శనార్థం కర్ణాటక రాష్ట్రంలో బాగల్ కోట్, దార్వాడ, కొప్పల్, మస్కీ, సింధనూరు, మాన్వి, శిరుగుప్ప తదితర ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు పాదయాత్రగా తరలివెళ్లడం ఆనవాయితీ. భక్తుల సౌకర్యార్థం కోసిగి కుర్డి పెద్ద నాగరాజు కాంప్లెక్స్‌లో భోజన, తాగునీటి, సేద తీరేందుకు వసతులు ఏర్పాటు చేశారు. అలాగే భక్తులకు ఇబ్బందులు లేకుండా దుద్ది, కొల్మాన్ పేట, ఆర్లబండ, చైతన్య స్కూల్, రంగప్ప గట్టు, డి.బెళగల్ ప్రాంతాల్లో వివిధ రకాలు సౌకర్యాలు కల్పించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి



కామవరంలో రికార్డులను పరిశీలిస్తున్న బాలకృష్ణారెడ్డి

కౌతాళం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలని జిల్లా నోడల్ అధికారి, డివిజన్ అభివృద్ధి అధికారి బాలకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని కామవరం, ఉరుకుంద, కుంబళనూరు, పొదలకుంట గ్రామాల్లోని సచివాలయాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు తప్పనిసరిగా అందజేసే బాధ్యత మీదేనన్నారు. ఉరుకుందలో అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేసి భోజనాలను పరిశీలించారు. కేంద్రం పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. శుభ్రత పాటించాలని నిర్వాహకులకు సూచించారు. వలీంటర్లు ఎస్‌డీజీ సర్వేకు సంబంధించి 0–5వయస్సు ఉన్న పిల్లలకు ఆధార్‌కార్డు లేకపోతే వారి జాబితా తయారు చేసి ఆధార్ నమోదు చేయించాలని చెప్పారు. ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయా గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.

బనగానపల్లెకు సాయిసేవక్ పాదయాత్ర

ఎమ్మిగనూరు: ఎమ్మిగనూరు నుంచి బనగానపల్లెకు సాయిసేవక్‌లు ఆరురోజుల పాదయాత్ర చేపట్టారు. స్థానిక షిరిడీ సాయి మందిరం నుంచి శుక్రవారం 12 మంది సేవక్‌లు బయలుదేరారు. ఎమ్మిగనూరు, గోనెగండ్ల, వేముగోడు, కోడుమూరు, వెల్దుర్తి, బ్రహ్మగుండం మీదుగా బనగానపల్లెకు చేరుకొని అక్కడ 124 అడుగుల సద్గురుసాయి ద్వితీయ వార్షికోత్సవంలో పాల్గొని సేవలందిస్తామని వారు తెలిపారు. మొదటిరోజు పాదయాత్ర గోనెగండ్ల మండలం వేముగోడు వరకు సాగింది.

ఘనంగా విగ్రహ, ధ్వజ ప్రతిష్ఠ

కృష్ణగిరి: మండల పరిధిలోని మన్నెకుంట గ్రామంలోని నూతన ఆలయంలో శుక్రవారం సుంకుల పరమేశ్వరి దేవి, నందీశ్వర, గణపతి, కుమారస్వామి, పార్వతీ దేవి, లింగమయ్య దేవతా విగ్రహాలు, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. గత మూడు రోజులుగా గ్రామస్తుల ఆధ్వర్యంలో పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య సాగుతున్న ఈకార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం రాత్రి రాష్ట్ర స్థాయి భజన పోటీలు జరిగాయి.

మందుబాబులకు జైలు, జరిమానా

కర్నూలు: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ డ్రంకన్ డ్రైవ్‌లో దొరికిన మందుబాబులకు స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సెకండ్ క్లాస్ కోర్టు న్యాయమూర్తి జైలు, జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో సుంకేసుల రోడ్డులోని సంజీవని హాస్పిటల్ దగ్గర డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. దీంతో మద్యం సేవించి అరుణ్‌కుమార్, మద్దిలేటి, సలీం రాజు, ఖాజా మియ, సుంకన్న, సురేష్, మురళీకృష్ణ, అన్వర్, షరీఫ్, మహేంద్ర, మధుశేఖర్, శాలిమియ్య, రాకేష్, మధు, జయరాముడు, రాజశేఖర్ తదితరులు పట్టుబడ్డారు. వీరిలో పది మందికి మూడు రోజులు జైలు, రూ.వెయ్యి జరిమానా, మరో ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.2 వేలు, మరొకరికి ఒక రోజు జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పినట్లు డీఎస్పీ నాగభూషణం తెలిపారు.

కనుల పండువగా ఆలయ ప్రారంభోత్సవం



ప్రతిష్ఠించిన అనంతరం ప్రత్యేక అలంకరణలో శివలింగం, ఆంజనేయస్వామి మూలవిరాట్



పూర్ణాహుతి పూజల్లో పాల్గొన్న ప్రదీప్‌రెడ్డి

కౌతాళం: మండలంలోని బంటకుంట గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠాపన, ధ్వజ స్తంభం ప్రతిష్ఠతో పాటు నూతనంగా నిర్మించిన ఈశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవం, నూతన శివలింగం, నంది విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు శుక్రవారం కనుల పండువగా జరిగాయి. మూడు రోజుల నుంచి కొనసాగుతున్న ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, హోమం వంటివి చేపట్టారు. అనంతరం వందలాది మంది ముత్తాయిదువులు కలశాలతో ముందు నడవగా..మేళిగనూరు మఠం పీఠాధిపతి చెన్నవిరా శివచార్య స్వాముల్ని, హాచ్చోళ్లి ముత్తిన పెండె మఠం పీఠాధిపతి శివరుద్రముని స్వాములకు గ్రామ పొలిమేర నుంచి ఊరేగింపుగా ఆలయం వరకు తోడ్కొని రాగా వారు నంది విగ్రహానికి, శివలింగ విగ్రహానికి, ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేలాది మంది భక్తుల మధ్య విగ్రహాలు, ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా శివచార్య స్వామి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ మానవత్వంతో మెలగాలని సూచించారు. అందరూ సమానమన్న భావనతో ఉండాలని, శాంతి నెలకొల్పేందుకు పరస్పరం సహకరించుకోవాలని చెప్పారు. ఆయా పూజా కార్యక్రమాలు, హోమం పూర్ణాహుతి పూజల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ నాయకుడు ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు. సర్పంచ్ గోపాల్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, కౌతాళం సర్పంచ్, మాజీ సర్పంచ్ పాల్‌దినకర్, అవతారం, వైఎస్ ఎంపీపీ బుజ్జిస్వామి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

కోసిగి: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ప్రాంతాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్ కో ఏఈ వీరేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రెండో శనివారం సందర్భంగా విద్యుత్ సబ్ స్టేషన్లో మరమ్మతుల పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కారణంగా ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

డీలర్లపై చర్యలు తీసుకోండి

కౌతాళం: ఉచితంగా వేయాల్సిన రేషన్ బియ్యానికి డబ్బులు వసూలు చేస్తున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి ఈరన్న కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దారుకు గ్రామస్తులతో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని కుంబళనూరులో మూడు నెలల నుంచి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఉచిత బియ్యానికి డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపించారు. పద్ధతి మార్చుకోవాలని సూచించిన ప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు.

రాజగోపుర నిర్మాణానికి విరాళం

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలోని శ్రీరంగనాథస్వామి దేవాలయంలో తూ ర్పు, దక్షిణ రాజగోపురాల నిర్మాణానికి అనంతపురం జిల్లా నాగిరెడ్డిపల్లికి చెందిన కాసేపల్లి యల్లమ్మ, కాసేపల్లి ఆదినారాయణరెడ్డి రూ. 1.10 లక్షల విరాళం అందజేశారు. ఈ నేపథ్యంలో వారికి ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి అభినందించారు.

ప్రతి మహిళ ఉన్నత విద్యను అభ్యసించాలి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ సతీమణి స్వర్ణలత, సీఈఓ రమణ

కర్నూలు(టౌన్): ప్రతి మహిళ ఉన్నత విద్యను అభ్యసించాలని జిల్లా కలెక్టర్ సతీమణి స్వర్ణలత పిలుపునిచ్చారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్ నుంచి రాజ్‌విహార్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కలెక్టర్ సతీమణి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు తీసుకురాగలమని చెప్పారు. ఆడపిల్లలకు చదువు ఎంతో ముఖ్యమని, ఆడ, మగ అన్న తేడా లేకుండా పిల్లలిద్దరినీ సమానంగా పెంచాలన్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ రమణ మాట్లాడుతూ.. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు మహిళలకు క్రీడాపోటీలతోపాటు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మెప్మా పీడీ నాగశివలీల, డీఎస్పీ మహబూబ్ బాషా, సత్యనారాయణ, వ్యాయామ అధ్యాపకులు, ఎస్వీఆర్, మెప్మా, మున్సిపల్ కార్పొరేషన్, డీఎస్ఏ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

కర్నూలు సిటీ: ప్రస్తుత కాలంలో గుండె సంబంధిత మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయని, కావున ప్రతి ఒక్కరూ సీపీఆర్ (కార్డియో పల్మనరీ రెస్యూసిటేషన్)పై అవగాహన కలిగి ఉండాలని రాయలసీమ యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య డా.సీవీ కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ సుందరానంద పుచ్చాలు అన్నారు. శుక్రవారం వర్సిటీలో సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్ని సందర్భాల్లో ఆగిన గుండెకు సీపీఆర్ చేస్తే తిరిగి గుండె పని చేసే అవకాశం ఉంటుందన్నారు. సీపీఆర్ ప్రథమ చికిత్సపై టెక్నీషియన్ ఈ.సుధాకర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల జిల్లాల 108 మేనేజర్లు ఎం.నవీన్, జి.సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్షరగేయాలు పుస్తకావిష్కరణ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని సిద్దార్థ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రాత్రి బాలసాహిత్య వేత్త అయిన రచయిత గద్వాల సోమన్న రచించిన అక్షర గేయాల పుస్తకాన్ని డాక్టర్ బ్రహ్మారెడ్డి నేతృత్వంలో పలువురు ఆవిష్కరించారు.రచయిత గద్వాల సోమన్న, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు ప్రభుదాస్, ఉపాధాయులు కుముద్వతి, నాగేశ్వరరావు, పాటిల్ ఈశ్వర్‌రెడ్డి, రిటైర్డ్ ఏఎస్‌డబ్ల్యూఓ ఆనంద్, డాక్టర్ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

మాధవుడి కల్యాణం మనోహరం



ఉత్సవమూర్తులైన స్వామి అమ్మవార్లు



గరుడవాహనంపై గ్రామ పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

కోడుమూరు రూరల్: మండల పరిధిలోని గోరంట్ల గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ మాధవస్వామి కల్యా ణం మనోహరంగా సాగింది. బ్రహ్మోత్సవాల్లో భా గంగా శుక్రవారం తెలవారుజామున శ్రీలక్ష్మీ, భూ దేవి మాధవస్వామిల కల్యాణాన్ని పండితులు వైభ వంగా నిర్వహించారు. స్వామి వారి తరపున ఎర్రగు డి వాసులు, అమ్మవార్ల తరపున గోరంట్ల వాసులు పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. స్వామి అమ్మవార్లకు కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పట్టువస్త్రాలు సమర్పించారు. స్థానిక భక్తులతో పాటు జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు కల్యాణాన్ని తిలకించి తరించారు. అనంతరం ఉత్సవమూర్తులను గరుడవాహనంపై ఆశీనులను చేసి మేళతాళాల మధ్య గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. గరుడసేవను మాజీ కేంద్ర సహాయ మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి ప్రారంభించారు.స్వామి అమ్మవార్ల కల్యాణంలో సర్పంచు బాలక్రిష్ణ, ఆలయ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, ఈఓ గు రెడ్డి, పండితులు వందవాసి రాధాకృష్ణ, లక్ష్మీనారాయణ, జనార్దన్, వెంకటరమణ, రమణమూర్తి, వెంకట్రామయ్య పాల్గొన్నారు.